www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 28 ఫిబ్రవరి 2024

ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పాటిస్తూ విధులు నిర్వర్తించాలని ఐటిడిఎ పిఒ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ ఆదేశించారు. మంగళవారం కెఆర్.పురం ఐటిడిఎలో పోలవరం నియోజకవర్గానికి సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, సిబ్బందితో కలిసి రాబోయే ఎన్నికల విధులకు సంబంధించిన సమావేశం జరిగింది. పిఒ సూర్యతేజ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల మేరకు ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి సంబంధించి ఓటరు జాబితా ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు అంశాలపై సమావేశంలో చర్చించి తగు సూచనలు ఇచ్చారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కారానికి సంబంధిత ఎన్నికల ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

టిక్కెట్.. తిరుగుబాటు..!

- టిడిపి, జనసేన నేతల్లో అసంతృప్తి తారాస్థాయికి
- ప్రకటించిన ఏడు స్థానాల్లో నాలుగుచోట్ల తిరుగుబావుటా
- ఉండి, తణుకు, ఏలూరులో నేతల ఆగ్రహ జ్వాలలు
- శివరామరాజు వైసిపిలోకి వెళ్లనున్నట్లు ప్రచారం
- తణుకులో విడివాడ రచ్చతో అంతర్మథనంలో జనసేన
- కాంగ్రెస్‌తో జతకట్టే యోచనలో రెడ్డి అప్పలనాయుడు?
- నాకు అన్యాయం చేశారంటూ ప్రజల్లోకి ముద్రబోయిన

విడివాడ రామచంద్రరావుకు సర్దిచెబుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిక్కెట్ దక్కని టిడిపి, వైసిపి నేతలు అధిష్టానంపై తిరుగుబాటుకు దిగారు. కష్టపడి పనిచేసిన తమకు అధినాయకులు అన్యాయం చేశారంటూ మండిపడుతున్నారు. దీంతో టిడిపి, జనసేన అధిష్టానాలు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. పొత్తులో భాగంగా టిడిపి తరపున ఏడు స్థానాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉండిలో టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకే మరోసారి టిక్కెట్ ఇచ్చారు. తనకు మద్దతుగా నిలవాలని ఎంఎల్ఎ రామరాజు ఆయన మద్దతు కోరినా.. లేదంటూ ఖరాఖండిగా చెప్పేశారు. టిక్కెట్ ఇస్తే వైసిపిలో చేరేందుకు శివ పావులు కదుపుతున్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి పివిఎల్.నర్సింహరాజు పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పివిఎల్‌కు కాదని వైసిపి శివరామరాజుకు టిక్కెట్ ఇస్తుందా అనే చర్చ నడుస్తోంది. వైసిపి టిక్కెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓట్లు చీల్చి మంతెన రామరాజును ఓడించాలనే లక్ష్యంతో శివరామరాజు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. తణుకు టిడిపి అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణ పేరు ప్రకటించగానే జనసేన నుంచి టిక్కెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తాడేపల్లిగూడెంలో జరగనున్న టిడిపి, జనసేన ఉమ్మడి సభ ఏర్పాట్ల పరిశీలనకు విచ్చేసిన జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఎదుట విడివాడ అనుచరులు నిరసన తెలిపి రచ్చ చేసిన సంగతి తెలిసిందే. విడివాడ ఇండిపెండెంట్‌గా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏలూరులో టిడిపి నుంచి బడేటి చంటికి టిక్కెట్ ఖరారు కావడంతో జనసేన నుంచి టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అప్పలనాయుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని, లేకపోతే కాంగ్రెస్‌లో చేరి బరిలోకి దిగుతారని ప్రచారాలు సాగుతున్నాయి. నూజివీడు టిక్కెట్‌ను వైసిపి నుంచి టిడిపిలో చేరిన పెనమలూరు ఎంఎల్ఎ కొలుసు పార్థసారథికి కేటాయించారు. దీంతో టిడిపి నుంచి టిక్కెట్ ఆశించిన ముద్రబోయిన వెంకటేశ్వరరావు అసంతృప్తితో ఉన్నారు. ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తానంటూ సహచరుల వద్ద అంటున్నట్లు తెలుస్తోంది. తనకు టిడిపి అన్యాయం చేసిందంటూ ప్రజల్లోకి వెళ్తూ ప్రచారం సాగిస్తుండటం విశేషం. రెండు జిల్లాలో టిడిపి అభ్యర్థులను ప్రకటించిన ఏడుస్థానాల్లో నాలుగు స్థానాల్లో నాయకుల తిరుగుబాటు కొనసాగుతోంది. రెండుచోట్ల సొంత పార్టీ నుంచే తిరుగుబాటు ఎదురవుతుండగా, మరో రెండు చోట్ల జనసేన నేతల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో పొత్తు సవ్యంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సహకరించను.. వెళ్లిపో..!

ఎంఎల్ఎ రామరాజు కరచాలనానికి స్పందించకుండా మౌనంగా ఉండిపోయిన మాజీ ఎంఎల్ఎ శివ

- ఎంఎల్ఎ రామరాజుకు తెగేసి చెప్పిన మాజీ ఎంఎల్ఎ శివరామరాజు
- రెండేళ్లు అవమానించి.. నా వాళ్లను భయపెట్టారు
- ఇప్పుడు మద్దతు కోరేందుకు రావడం న్యాయమేనా
- ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు
- వైసిపిలో చేరనున్న శివరామరాజు!

ప్రజాశక్తి - భీమవరం

ఉండి కంచుకోట టిడిపిలో ఏర్పడిన అసంతృప్తి అలజడి రోజురోజుకీ అగ్నిజ్వాలలా రగులుతోంది. ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మధ్య జరుగుతున్న టిక్కెట్ రగడ తారాస్థాయికి చేరింది. ఉండి ఎంఎల్ఎ స్థానాన్ని మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఆశించారు. అయితే సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజుకు టిక్కెట్ కేటాయించింది. దీంతో టిడిపి అధిష్టానంపై శివరామరాజు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అయితే శివరామరాజు మద్దతు కూడగట్టేందుకు భీమవరంలో శివ కార్యాలయానికి మంగళవారంనాడు ఎంఎల్ఎ రామరాజు తన సోదరుడు నరసింహరాజుతో కలిసి వెళ్లారు. శివరామరాజు ఎదురుగానే కూర్చున్నప్పటికీ చాలాసేపు రామరాజు, శివరామరాజు ఇరువురు మౌనంగానే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ రామరాజు శివరామరాజుని 'అన్నయ్యా.. నీతో మాట్లాడటానికి వచ్చాను' అంటూ ఆయన పక్కన కూర్చున్నారు. వెంటనే శివరామరాజు అక్కడ నుంచి పైకి లేచి 'నువ్వు వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపో.. నీకు సపోర్టు చేసేది లేదు' అని తెగేసి చెప్పారు. దీంతో ఖంగుతిన్న రామరాజు అక్కడి నుంచి అవమాన భారంతో వెనుదిరిగారు. ఇదే సందర్భంలో మీడియాతో ఎంఎల్ఎ రామరాజు మాట్లాడే ప్రయత్నం చేయగా 'నా అనుమతి లేకుండా.. నా కార్యాలయంలో మాట్లాడటం కుదరదు' అని శివరామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడున్న కార్యకర్తలు పెద్దఎత్తున శివరామరాజు అనుకూలంగా నినాదాలు చేశారు.

టిడిపి నమ్మించి గొంతు కోస్తే.. ఎంఎల్ఎ రామరాజు వంచించారు

20 ఏళ్లపాటు టిడిపికి విధేయునిగా ఉండి టిడిపి అభివృద్ధితోపాటు కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్నానని, అయితే టిడిపి నమ్మించి గొంతు కోస్తే.. ఎంఎల్ఎ రామరాజు వంచించారని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2004లో కలిదిండి అబ్బాయిరాజు మద్దతు పొంది, 2005లో శివ స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పి ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేశానన్నారు. 2006లో టిడిపిలో చేరి 2009లో టిడిపి తరఫున బరిలోకి దిగి గెలుపొందానని, 2014లో మళ్లీ ఎంఎల్ఎగా గెలుపొందానని చెప్పారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నరసాపురం ఎంపీగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందానన్నారు. పార్టీకి ఇంత విధేయతగా పని చేసినప్పటికీ తనను కనీసం సంప్రదించకుండా రామరాజుకు టిక్కెట్ కేటాయించి పార్టీ అధిష్టానం తనను ఘోరంగా అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి ఎంఎల్ఎ రామరాజు తనను అనేక అవమానాలకు గురి చేశారన్నారు. చివరకు తన పేరును తలుస్తున్న వారిని సైతం భయబ్రాంతులకు గురి చేశారన్నారు. తన హృదయం అగ్నిగోళంలా మండుతున్నా పార్టీ కోసం అన్నీ దిగమింగుకుని భరించానని తెలిపారు. ఇప్పుడు ఎంఎల్ఎ రామరాజు మద్దతు కోసం తన వద్దకు వచ్చి 'మా అన్నయ్య.. మా కుటుంబం' అంటూ బంధుత్వాలు కలపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం డబ్బు, అహంకారంతో రామరాజు పెట్రేగిపోతున్నారని విమర్శించారు. ప్రజాభీష్టం మేరకు రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో జరగబోయే టిడిపి, జనసేన ఉమ్మడి సభకు తనకు ఆహ్వానం అందలేదన్నారు. మంగళవారం భీమవరంలో జరిగిన టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశానికి కూడా ఆహ్వానం అందలేదని చెప్పారు.

వైసిపిలో చేరే యోచనలో శివరామరాజు..!

ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు వైసిపిలో చేరే యోచనలో ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. శివరామరాజు తనకు టిక్కెట్ విషయంలో జరిగిన అన్యాయానికి, పార్టీ వ్యవహరించిన తీరుకు తీవ్ర మనస్తానికి గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైసిపిలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. శివ తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. అయితే వైసిపిలో చేరితే ఆయన ఉండి నుంచే పోటీలో ఉంటారా లేక భవితవ్యం ఏమిటనే దానిపైనా పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్థానిక ఎన్‌జిఒ హోమ్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎపి జెఎసి ఉద్యమాన్ని అణగదొక్కాలని చూడటం దారుణమన్నారు. ఉద్యోగ సంఘ నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దశలవారీ ఉద్యమిస్తామని, ఐనా ప్రభుత్వం దిగి రాకపోతే మెరుపు సమ్మె చేపడతామని హెచ్చరించారు. జెఎసి కన్వీనర్ నెరుసు రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలా ఉద్యోగులను మోసగించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి కప్పల సత్యనారాయణ, కె.నాగమణి, కె.సునీత, సత్యభారతి, పూడి శ్రీనివాస్, మాదాసు సాంబశివరావు, ఎమ్‌డి.బేగ్ పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలి

- ఎర్రకాలువ రిజర్వాయర్ ఆధునికీకరణ చేపట్టాలి
- వందేభారత్ రైలుకు ఏలూరులో హాల్ట్ కల్పించాలని అభ్యర్థన
- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతగా చేపట్టిన అన్ని కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేసి లక్షిత ప్రయోజనాలను ప్రజలకు సమగ్రంగా చేరేలా చూడాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం ఎంపీ కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఎంపీ కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో అమలవుతున్న తీరు, ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సమగ్రంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి వాల్స్ రిపేర్, అదనపు గేట్ల అమరిక, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టేందుకు జనవనరుల శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో వందేభారత్ రైలుకు హాల్టు ఇవ్వాలని ఇప్పటికే ఢిల్లీలోని రైల్వేబోర్డ్ ఛైర్మన్‌ను కోరానని, సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో వృత్తి నైపుణ్య కార్యక్రమాలు మరింత ముమ్మరం చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో జిల్లాలో మంజూరు చేసిన వివిధ నిర్మాణ అభివృద్ధి పనులను రానున్న రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆయన కోరారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి హామీకి సంబంధించి పాత పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయాలని, అందుకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నీ రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఇని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, దిశ కమిటీ సభ్యులు ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, చింతలపూడి ఎంపిపి డాక్టర్ బి.రాంబాబు, కైకలూరు సర్పంచి వి.వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి: కలెక్టర్

ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాలతో మార్చి ఒకటి వరకు నిర్వహించనున్న డిజిటల్ లిటరసీ అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం డి.నీలాద్రి, పలు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే పనులు అడ్డుకుంటాం

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సదస్సు నిర్ణయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే పనులు అడ్డుకుంటామని గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసిత రైతులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పేరంపేటలో గోలి నర్సిరెడ్డి ఇంటి వద్ద ఎపి రైతుసంఘం, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో భూనిర్వాసిత రైతుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి న్యాయం చేస్తామని కలెక్టర్ ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. పరిహారం పెంచుతూ ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. భూసేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం పెంపుతోపాటు సర్వీస్ రోడ్లు, బోర్లు కోల్పోయిన వారికి బోర్లు, విద్యుత్ లైన్లు, ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర ఉద్యాన తోటలకు పరిహారం పెంపు తదితర హామీలు అమలు చేయలేదన్నారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించి బీటీ రోడ్లు నిర్మాణం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం చట్ట వ్యతిరేకమన్నారు. మళ్లీ గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంబడి కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్ పేరుతో భూసేకరణ చేస్తారనే వార్తలు రావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన ఉందని చెప్పారు. న్యాయమైన పరిహారం ఇవ్వకుండా రైతుల భూములను బలవంతంగా లాక్కుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూనిర్వాసిత రైతులు గోలి నర్సిరెడ్డి, గూడపాటి శ్రీనివాసరావు, వందనపు సాయిబాబా మాట్లాడుతూ భూమి ఒక వైపు బోర్ వైపు ఉన్న రైతులకు హైవే కింది నుండి ప్లాస్టిక్ పైపులు వేయిస్తామని హైవే అథారిటీ పీడీ హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. మళ్లీ మరికొంత భూమి అవసరమని భూమి సేకరించి ఇంతవరకు రైతులకు పరిహారం చెల్లించలేదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల వస్తున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో మార్చి 5న పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, బి.రామిరెడ్డి, బి.సత్తిరెడ్డి, గోలి రవీంద్రరెడ్డి, మాండ్రు సూర్యచంద్రం, చలపతి కృష్ణారెడ్డి, పాపదాసు సత్తిరెడ్డి, పల్లె వెంకట రామారావు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విద్యార్థి

మండల పరిధిలోని ఎన్ఆర్ఐ కాలేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్ఆర్ఐ కాలేజీ విద్యార్థి దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం సాయంత్రం నెలకొంది. ఎన్ఆర్ఐ కాలేజీలో సిఎస్ఇ మొదటి సంవత్సరం చదువుతున్న అడవినెక్కలంకు చెందిన మచ్చా పవన్ వెంకట సత్య జశ్వంత్(19) కాలేజీ వదిలిన తర్వాత తన డ్యూక్ బైక్‌పై అడవినెక్కలం వెళుతుండగా మార్గమధ్యలో ఆర్‌టిసి బస్సును ఢీకొనటంతో దుర్మరణం పాలైయ్యాడు. జశ్వంత్ తండ్రి మచ్చా వెంకటేశ్వరరావు స్థానిక కుశలవ కంపెనీలో గత 30 సంవత్సరాలుగా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మచ్చా వెంకటేశ్వరరావు కుటుంబానికి జస్వంత్ ఏకైక సంతానం కావడంతో కుటుంబ సభ్యుల రోదనలతో అడవినెక్కలం పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

జంగారెడ్డిగూడెం టౌన్ : పరీక్ష సమయంలో విద్యార్థులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి ఎటికి వినతిని అందించారు. అనంతరం ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖమ్మం జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు, ఏలూరు జిల్లాలో ప్రభుత్వం విలీనం చేసిందన్నారు. అప్పటి నుంచి రెండు మండలాల్లో చదువుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో భద్రాచలం డిపో నుంచి బస్సు సౌకర్యం ఉండేదని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో ఆంధ్ర వాళ్లకి బస్సు సౌకర్యం తీసివేశారని తెలిపారు. కావున ఇప్పుడు విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

డబ్ల్యుటిఒ ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలి

ఒప్పంద ప్రతులు దహనం చేసి నిరసన తెలిపిన ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఒప్పంద ప్రతులు దగ్ధం చేస్తున్న నేతలు

రైతాంగానికి, కార్మికులకు, దేశ ప్రజలకు నష్టం కలిగించే వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఒ)తో ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జంగారెడ్డిగూడెంలోని పంగిడిగూడెం రోడ్ సెంటర్‌లో డబ్ల్యుటిఒ ఒప్పంద ప్రతులను దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్విట్ డబ్ల్యుటిఒ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడారు. అబుదాబిలో జరుగుతున్న డబ్ల్యుటిఒ సమావేశాలలో రైతాంగానికి, కార్మికులకు నష్టం కలిగించే విధంగా మోడీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధం కావడం దారుణమని విమర్శించారు. దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టడం తగదన్నారు. ఈ ఒప్పందాల వల్ల మద్దతు ధరలు, పంటల కొనుగోలు వ్యవస్థలు, దేశ ఆహార భద్రత చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థలు ధ్వంసం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలన్నారు. ఒకవైపు దేశంలో రైతులు ఉద్యమాలు చేస్తుంటే మరోవైపు అందుకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలకు సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల, దిగుమతులకు పూర్తిగా సుంకాలు ఎత్తివేయడంతో దేశంలో పంటల ధరలు పడిపోయి, రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్, కొబ్బరి తదితర పంటలకు ధరలు పడిపోవడానికి ఈ ఒప్పందాలే కారణమని విమర్శించారు. ధాన్యం, మరికొన్ని ఆహార ధాన్యాల సేకరణ నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటాయని చెప్పారు. వ్యవసాయం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని అన్నారు. డబ్ల్యుటిఒ ఒప్పందాల నుంచి మోడీ ప్రభుత్వం బయటికి రావాలని, లేనిపక్షంలో ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్మిక, వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుంచి వ్యవసాయాన్ని మినహాయించాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించవద్దన్నారు. ఉపాధి హామీ చట్టం సంవత్సరానికి 200 రోజులకు పెంచి, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అందుగుల ప్రభాకర్, కె.సుబ్బారావు, సిఐటియు నాయకులు బి.నాని, కె.స్టాలిన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

డిఇఒకు వినతినిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఏలూరుఅర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహంకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి పరీక్షల విధులలో తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు, మార్చి, ఏప్రియల్ నెలలో పదవీ విరమణ ఉన్నవారికి, అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ఎస్ఎస్‌సి స్పాట్ విధులలో 58 సంవత్సరాల వయస్సు దాటిన వారికి, తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు ఉన్నవారికి, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ముందుగానే రిక్వెస్ట్ లెటర్ తీసుకొని మినహాయింపు ఇవ్వాలన్నారు. సింగిల్ రూమ్ డిస్మాండిల్ స్కూల్స్‌కు నాడు-నేడు నిధులు పూర్తిగా విడుదల కానందున అందుబాటులో ఉన్న పాఠశాలల నుంచి టిఇఒగా నిధులు మంజూరు చేయాలని అన్నారు. ద్వారకాతిరుమల మండలం, సంద్రగుంట ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఎంపిపి మెట్ట పంగిడిగూడెంలో ఎమ్‌టిఎస్ టీచర్ అనారోగ్య కారణం చేత పూర్తిగా హాజరు కాలేకపోవడం, చుట్టుపక్కల పాఠశాలలో టీచర్లు లేకపోవడం, సిహెచ్ పోతేపల్లి యుపి పాఠశాలలో ఎస్ఎ ఫిజికల్ సైన్స్ ఖాళీగా ఉండుట వల్ల ఆయా పాఠశాలలకు పక్క మండలాల నుంచి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. పై సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రుద్రాక్ష రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, జిల్లా కోశాధికారి జివి.రంగమ్మోహన్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లతో విద్యార్థులు

విద్యార్థుల్లో మానసిక వికాసానికి 'క్రీడోత్సవాలు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు, తద్వారా శారీరక మానసిక ధృఢత్వాన్ని పెంచేందుకు ఇలాంటి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని హెచ్ఎం మంత్రి సత్యనారాయణ తెలిపారు. స్థానిక బాలాజీ నగర్ శ్రీచైతన్య స్కూల్లో మంగళవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు క్రీడాజ్యోతి వెలిగించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె.షమ్మీ బేగం, డీన్ సుధాకర్, ప్రైమరీ ఇన్‌చార్జి స్వాతి నాయుడు, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి జ్యోతి, క్రీడా ఉపాధ్యాయులు శ్రీదీప్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - కామవరపుకోట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్‌పిటిసి కడిమి రమేష్ తెలిపారు. మండలంలోని కెఎస్.రామవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి వైద్య రంగం మీద ప్రత్యేక చొరవ తీసుకుని చేస్తున్న పనులను వివరించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్య సహాయం రూ.25 లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. అనంతరం వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేడవరపు విజయ లక్ష్మి, డాక్టర్ మనోజ్, డాక్టర్ జావిద్, ఇతర నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముసునూరు: ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్య, ఆరోగ్య రంగాలపై దృష్టి సారిస్తున్నారని ఎంపిడిఒ. వాగంటి ప్రభాకర్‌దేవి అన్నారు. వైద్యులు ఎండి కరిముల్లా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష 'ఫేజ్-2' కార్యక్రమంలో మండలంలోని చక్కపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య సేవలు నిర్వహించారు. అధిక సంఖ్యలో రోగులు పాల్గొని వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపిటిసి తోట రామాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ. భవాని శంకరి మంగళవారం సందర్శించారు. గతంలో కెడిసిసి బ్యాంకు ఆవరణలో ఉండే 180, 181 పోలింగ్ కేంద్రాలను పెద్ద చెరువు సమీపంలోని ఎంఎ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలోకి మార్చారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ. మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తనను సంప్రదించాలని ఆమె అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

ఆనంద నిలయానికి రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఆర్యసంఘం అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ అడపా శ్రీనివాసరావు తన పుట్టినరోజు సందర్భంగా ఉంగుటూరులో నిర్విస్తున్న ఆనంద నిలయానికి రూ.50 వేల విరాళం అందించారు. మంగళవారం నారాయణపురంలో మానవతా సంస్థ సభ్యులు, వర్తక సంఘం సమక్షంలో చెక్కు ఆనంద నిలయం నిర్వహణ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు, రాజకీయ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళ హత్యకేసులో ముద్దాయి అరెస్టు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్తరామయ్యపేటలో ఈనెల 25వ తేదీ, ఆదివారం రాత్రి మహిళ మేడూరి దుర్గ హత్య కేసులో హంతకుడిని పోలవరం పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పోలవరం డిఎ ఎన్.సురేష్ కుమార్ రెడ్డి స్థానిక డిఎస్‌పి కార్యాలయం వద్ద ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి నిందితుడిని చూపించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ హత్యకు గురైన దుర్గ హత్య విషయంలో సిఐ జి.మధుబాబు దర్యాప్తులో ప్రత్యేక బృందాలను, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ నిపుణులతో నేర స్థలాన్ని పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిఘా ఏర్పాటు చేసి, హత్యకు పాల్పడిన ముద్దాయిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. హంతకురాలి దూరపు బంధువైన మేడూరి ప్రసాద్‌తో మృతురాలికి గత సంవత్సరం క్రితం నుంచి లైంగిక సంబంధం ఉందని, ఇటీవల నెలరోజుల నుంచి ఆమె వేరే వ్యక్తితో ఫోన్ మాట్లాడుతున్నట్లుగా అనుమానించి నిత్యం ఆమెతో గొడవపడేవాడని తెలిపారు. ఈ నేపథ్యంలో హత్యకు కొద్ది సమయం ముందు ముద్దాయి మృతురాలికి అనేకసార్లు ఫోన్ చేసి ఆమె వేరే వారితో ఫోన్ మాట్లాడుతున్న విషయంపై వాగ్వివాదం పెట్టుకున్నాడని, కోపంతో ఆమెను చంపాలనే ఇంట్లో కూరగాయలు తరిగే చాకు జేబులో పెట్టుకుని మృతురాలి ఇంటికి సమీపంలో ఉన్న మామిడి తోటలో నుంచి వెదురు కంచె దాటి వచ్చేసరికి మృతురాలు ఫోన్ మాట్లాడుతుండగా ఆమెపై దాడి చేసినట్లు తెలియజేశారు. ఆమెను వెనుకకు నెట్టి బోర్లా పడేసి, అరవకుండా చీరకొంగుతో మెడను ఒడిసిపట్టి తన వెంట తెచ్చుకన్న చాకుతో మెడ కోసి, ఆమె మాట్లాడుతున్న సెల్ ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడన్నారు. రక్తపు మరకలు అంటుకున్న బట్టలు తన గేదెల పాక వద్ద మార్చుకుని, చాకు, రక్తపు బట్టలు మొక్కజొన్న చేలో ఎవరికీ కనపడకుండా దాచినట్లు తెలిపారు. ఆధారాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ముద్దాయిని కోర్టులో హాజరు పరిచి, తదుపరి విచారణ చేస్తున్నామన్నారు. హత్య జరిగిన అతి తక్కువ వ్యవధిలో కేసు మిస్టరీ ఛేధించడానికి సహకరించిన పోలీసులను జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి అభినందించారని తెలిపారు. దర్యాప్తు బృందంలో సిఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఏలియా రాజు, సిబ్బంది జె.బాబీ, బి.బాలాజీరావు, కె.కోటేశ్వరరావు, ఎం.గంగరాజు, బి.రమేశ్, కె.నాగరాజు, టిబిఆర్.ప్రసాద్, కె.మురళీకృష్ణ, జె.నాగలక్ష్మీ, పోలవరం బేస్ స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు అశోక్, వీరబాబు, శివ, సతీష్‌లను రివార్డులకు సిఫార్సు చేయడం జరిగిందని తెలియజేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలోని మైత్రి బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామవరపుకోట జలపవారి గూడెంకు చెందిన రాచప్రోలు శ్రీను(38)కి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. కుటుంబ కలహాల కారణంగా శ్రీను గత కొద్దికాలంగా జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటూ సాయిస్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసైన శ్రీను ఏమైందో ఏమో కానీ మంగళవారం ఉదయం మైత్రి బార్ అండ్ రెస్టారెంట్ ఖాళీ స్థలంలో శవమై కనిపించాడు. జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని వెంకటాద్రిపురం వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో విస్సన్నపేట నుంచి వస్తున్న బైకు, నూజివీడు వైపు నుంచి వెళుతున్న బైకు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో నూజివీడుకి చెందిన సందీప్(24), చింటూ(25)లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పూడుకుపోయిన.. ఆంధ్ర కాలువ

పునరుద్ధరించాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆంధ్రకాలువ ద్వారా చింతలపూడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వర్షాలు పడకపోయినా.. వర్షాలు వచ్చినప్పుడు ఈ కాలువ ద్వారా చెరువులలోకి చేరిన నీటిని రైతులు ఉపయోగించుకునేవారు. తద్వారా రైతులు పంటను పడించుకోవడానికి ఈ కాలువ ఎంతో ఉపయోగపడేది. అలాంటి కాలువ ఇప్పుడు పూడుకుపోయి, పిచ్చి మొక్కలతో, ముళ్లపొదలతో చిన్నా భిన్నంగా ఉంది. ఈ కాలువపై దృష్టి పెట్టే నాధుడే లేడు.

పూడుకుపోయిన ఆంధ్రకాలువ

ఇప్పటికీ ఈ కాలువ నిరుపయోగంగా మారింది. వర్షాలు లేక పంటలు ఎండిపోయాయని, ఈ కాలువ పూడికలు తీసి ఉంటే రైతులకు నష్టం కలిగి ఉండేది కాదని, ఇప్పుడు ఈ కాలువకు మరమ్మతులు కూడా పనిచేయవని, పూర్తిగా పునరుద్ధరించాలని రైతులు చెబుతున్నారు.

ఆంధ్ర కాలువను మొదటిసారిగా అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ఉన్నప్పుడు అప్పటి ఇరిగేషన్ మంత్రి సుబ్బారెడ్డి బెతుపల్లి అలుగు నుంచి వరద నీరు వృధాగా పోతుందని రెండు కాలువలను ఏర్పాటు చేశారు. ఒకటి శివపురం, చిన్నంపేట మధ్యలో నుంచి కాలువను తుమ్మూరు వద్ద 1963లో మొదలు పెట్టి 1967లో పూర్తి చేశారు. ఈ కాలువ కింద సుమారు 8 వేల ఎకరాల సాగు, సుమారు 12 కిలోమీటర్లు పొడవున 21 చెరువులు ముడిపడి ఉన్నాయి. కనులభంద్ చెరువు సుమారుగా 1,500 ఎకరాలు, ఆయుకట్టు లింగసముద్రం 1000, తుమ్మల చెరువు 200, మద్రిబంధం 1500, మనుకుంటా 300, వెంకటాద్రి చెరువు 1500 ఎకరాలు, పోతురాజు 300, పెద్దచెరువు 600, అరకట్ట 300, అధికట్ట 700 ఎకరాలలో, 200 లేదా 300 ఎకరాలలో సాగు జరుగుతుంది. ఈ కాలువ పూర్తిగా పూడికపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బేతుపల్లి చెరువు అలుగు పడినప్పుడు ఈ కాలువ ద్వారా చెరువులలోకి నీరు వచ్చేవి. అది కూడా బేతుపల్లి చెరువు అలుగు అడుగు ఎత్తు పెంచడంతో అడుగుపైన వరద నీరు వస్తే అవి కాలువ కింద చెరువులోకి చేరేవి. ఇప్పుడు ఈ కాలువని పునరుద్ధరిస్తే, చింతలపూడి ఎత్తిపోతల కాలువ పూర్తి అయిన తర్వాత సమ్మెట్లవారిగూడెం వరకు నీరు అందించవచ్చు అని రైతులు చెబుతున్నారు.

వర్షాలు లేక పోతునూరు, సమ్మెట్లవారిగూడెం, మలయ్యగూడెం, పోతునూరు సుమారుగా 3 వేల ఎకరాలలో రైతులకు పంట నష్టం వాటిల్లింది. అప్పట్లో కనీసం పూడికలు తీసినా ఈ కాలువ ద్వారా వచ్చే వరద నీరు ద్వారా రైతులకు ఎంతో కొంత మేలు జరిగేదని ఎంపీ ఎదుట రైతులు మొరపెట్టుకున్నారు. అంటే ఈ కాలువ ఎంత ప్రాధాన్యం కలిగిందో అర్ధమవుతుంది.

2011 సంవత్సరంలో ఈ కాలవను మరమ్మతులు చేయించడానికి మూడు కోట్లు ఖర్చు అవుతుందని ప్రణాళిక సిద్ధం చేసి, నివేదికను అందజేశారు.

ఈ కాలువ పూర్తిగా పూడిక పోవడం వల్ల ఉపయోగం ఉండదని చెబుతున్నారు. ఈ కాలువను పునరుద్ధరించాలని రైతులు వేడుకుంటున్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ చొరవతో మరమత్తులకు నిధులు కేటాయించినా.. ఈ కాలువను పూర్తిగా పునర్దరించడానికి రూ.5 కోట్లు ఖర్చు అవుతుందంటున్నారు. ఇప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసి టెండర్లు వేస్తే, వచ్చే ప్రభుత్వంలో అయినా ఈ కాలవను పునరుద్ధరించవచ్చని చెబుతున్నారు. ఈ కాలువను పునరుద్ధరిస్తే తమకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు వేచి చూస్తున్నారు.

ఆంధ్రకాలువను పునరుద్ధరించాలి

చిన్నంశెట్టి శ్రీరామ్మూర్తి, డిఎన్ రావు పేట

ఆంధ్ర కాలువ పునరుద్ధరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ కాలువ చుట్టూ 8 వేల ఎకరాలలో విస్తరణ జరుగుతుంది. ఈ కాలువ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

టెండర్లు పిలిచి, నిధులు కేటాయించాలి

వసంతరావు, సిపిఐ సీనియర్ నాయకులు

ఈ కాలువను పూడికలు కాకుండా పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ కాలువకు రూ.5 కోట్లు వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ కాలువను పునరుద్ధరిస్తే రేపు చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి అయ్యాక సమ్మెటివారిగూడెం వరకు రైతులకు నీరు అందించవచ్చు. ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేసి, టెండర్లు పిలిస్తే, వచ్చే ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులతో నిధులు కేటాయించుకొని, ఈ కాలువను పునరుద్ధరణ చేయాలి.

ఊరి బయట పడేసిన పంచదార ప్యాకెట్లు

నిత్యావసర సరుకులు దొడ్డిదారి ..!

పంచదార ప్యాకెట్లు

కిరాణా షాపులకు అమ్ముతున్న రేషన్ డీలర్లు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలం దాచారం పంచాయతీ బెస్తగూడెం గ్రామ ఊరి చివర సమీపంలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల ద్వారా ప్రజలకు అందిస్తున్న పంచదార ప్యాకెట్లు సుమారు 100 ప్యాకెట్లను ఊరి బయట పడేయం జరిగింది. అందులో ఉన్న పంచదారను బస్తాల్లోకి నింపుకొని ఖాళీ ప్యాకెట్లను ఊరి బయట పారేస్తున్నారు. రేషన్ డీలర్ల ద్వారానే షాపుల్లోకి అమ్మకాలు జరుగుతున్నాయి అనేది సమాచారం. రేషన్ డీలర్లు ద్వారా ప్రజలకు అందాల్సిన పంచదార ఒక్కసారిగా అన్ని ప్యాకెట్లు బయటికి ఏవిధంగా వచ్చాయనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల ద్వారా ప్రజలకు అందిస్తున్న పప్పు, పంచదార వంటి నిత్యావసర సరుకులను రేషన్ డీలర్లు దొడ్డిదారిన కిరాణా షాపుల్లోకి అమ్ముతున్నారనేది సమాచారం.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులో పలుచోట్ల ఈనెల 28వ తేదీ, బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జెపిబి.నటరాజన్ తెలిపారు. నార్త్ - ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి ఆర్‌టిసి ఫీడర్‌కు చెట్లు నరకడం, లైన్లకు మరమ్మతు చేయడం జరుగుతుందన్నారు. కావున అశోక్ నగర్ స్టేషన్ పరిధిలోని పోలీస్ లైన్స్, కొత్త బస్టాండ్ ఏరియా, ఆర్‌వి రామారావు వీధి, గ్రాండ్ ఆర్య రోడ్, డాక్టర్ సత్యనారయణ వీధి ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, కావున వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

'క్రీడల్లోనూ రాజకీయాలు.. వైసిపి దిగజారుడు తనానికి నిదర్శనం'

పెదపాడు: వైసిపి నాయకులు తమ అహంకారంతో రాష్ట్రంలోని క్రీడాకారుల జీవితాలను సైతం నాశనం చేస్తున్నారని, 'ఆడుదాం ఆంధ్రా' అని కాకుండా 'ఆడుదాం ఆటగాళ్ల జీవితాలతో' అని కార్యక్రమాల పేర్లు పెట్టుకుంటే వైసిపి ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుందని ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. పెదపాడులో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీ పథకాల విశిష్టతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ వైసిపి నేతల ఒత్తిళ్లతో సొంత రాష్ట్రంలో ఇమడలేక, తెలుగుతేజాలు ఎంతో మంది పక్క రాష్ట్రాలకు వెళ్లి వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారని తెలిపారు. తనదైన శైలిలో ప్రత్యర్థులకు చుక్కలు చూపించే క్రికెటర్ హనుమ విహారి వైసిపి నేతల ఒత్తిళ్లకు బలి కావాల్సి వచ్చిందని అన్నారు. వైసిపి కారణంగా ఆంధ్ర టీం మంచి ఆటగాడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, పెదపాడు మండల పార్టీ అధ్యక్షులు లావేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'యువత సేవాభావాన్ని కలిగి ఉండాలి'

ఏలూరు టౌన్: యువత సేవా భావాన్ని కలిగి ఉండి పట్టు విడువకుండా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా సరే పేద ప్రజలకు తమ సేవలు అందిస్తూ, ఎల్లవేళలా వారికి అండగా నిలబడాలని రోమన్ కథోలిక పీఠం ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావ్ పొలిమేర తెలిపారు. ఏలూరు విద్యానగర్‌లోని బిషప్ హౌస్‌లో పీఠాధిపతి పొలిమేర జయరావ్‌ను మంగళవారం ఉదయం రాజమండ్రి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి కెఎస్.జవహర్, చింతలపూడి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సొంగా రోషన్ కుమార్ సహా పలువురు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ అగ్ర పీఠాధిపతిగా అదనపు బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా బిషప్ జయరావ్‌ను దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మిషన్ హెూప్ సంస్థ ద్వారా సొంగా రోషన్ పేద ప్రజలకు అందించిన సేవలను బిషప్ జయరావ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొడాలి విజయ్ బాబు, దేవరపల్లి పార్టీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో పలు అభివృద్ధి పనులకు కొయ్యలగూడెం మండల పరిషత్ అధ్యక్షులు గంజిమాల రామారావు జెడ్‌పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మితో కలిసి శ్రీకారం చుట్టారు. మండలంలోని యర్రంపేట, రాజవరం పంచాయతీలలో పనులకు మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తొలుత యర్రంపేట పంచాయతీలోని తిమ్మన్నకుంట గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సిమ్మెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో చేపట్టే ఈ పనులు వేగవంతంగా చేయాలని సూచించారు. అనంతరం రాజవరం పంచాయతీ గంగన్నగూడెంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో నిర్మించే గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృతనిశ్చయంతో ఉందన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ స్వరాజ్యం విరాజిల్లుతుందన్నారు. జెడ్‌పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని ముందంజలో నిలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాజవరం గ్రామ సర్పంచి ఏలేటి చిన్న తుక్కయ్య, రాజవరం ఎంపిటిసి సభ్యులు కొండెపాటి చింతయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి దాసరి విష్ణు, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, వైసిపి తిమ్మన్న కుంట గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి

రాష్ట్రాభివృద్ధికి జగన్మోహన్‌రెడ్డి కృషి : ఎంఎల్ఎ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - మండవల్లి

ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని పెనుమాక లంకలో రూ.7.80 కోట్లతో నిర్మించనున్న పెద్ద అడ్లగాడి సిద్ధాంతం రహదారి అభివృద్ధి పనులకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మంగళవారం కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే చేస్తాడు అనే నమ్మకాన్ని కలిగించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఆనాడు పాదయాత్రలో కొల్లేటి ప్రాంత ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ కొల్లేటి ప్రాంత ప్రజలకే ఎంఎల్‌సి కేటాయిస్తానని ప్రకటించి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. పేద ప్రజల అభివృద్ధిపై ఆయనకున్న సామాజిక స్పృహ మరొకరికి లేదన్నారు. ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చడని అన్నారు. పేద ప్రజలను, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా జగనన్నకు అందరూ అండగా ఉండాలని అన్నారు. అనంతరం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ వీర్రాజు, ఎస్‌సి సెల్ నాయకులు బొడ్డు నోబుల్ పాల్గొన్నారు.

అధికారుల సహకారం మరువలేనిది

పదవీ కాలం ఎంతో సంతృప్తినిచ్చింది : ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఎంపీగా తన పదవీ కాలం ఎంతో సంతృప్తినిచ్చిందని ఎంపీ కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం దిశ సమావేశం అనంతరం ఎంపీ శ్రీధర్‌ను జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ మంగళవారం జరిగిన సమావేశంలో అజెండాలోని అన్ని అంశాలను సమీక్షించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఎంపీ హోదాలో ఇది ఆఖరి సమావేశంగా భావిస్తున్నానని, గత 5 సంవత్సరాలుగా పార్లమెంట్ సభ్యునిగా, రాజకీయవాదిగా ప్రజలకు అందించిన సేవలు తనకు సంతృప్తినిచ్చాయన్నారు. ప్రజలు ఆశించిన స్థాయిలో పనిచేసి, తన పదవీకాలం ముగింపుతో బయటకు వస్తున్నానన్నారు. ప్రజలు తమ పనిపై అధికారుల వద్దకు వచ్చిన సమయంలో మంచి పరిష్కారాన్ని చూపాలన్నారు. తాము రాజకీయంగా ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందని, అయితే ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీసంతా ప్రజలకు సేవలు అందించే అవకాశం కలుగుతుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు అన్ని విధాలా మేలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. తన మనస్సు ఎప్పుడూ నియోజకవర్గం చుట్టూనే ఉంటుందని, ప్రజలకు మేలు చేయడంలో తాను ముందుంటానని తెలియజేశారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మన్ననలు పొందేలా ఎంపీ శ్రీధర్ సేవలు అందించారన్నారు. రైల్వే అంశాలకు సంబంధించి పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. ఎంతో సహృదులైన ఎంపీ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలుస్తారన్నారు. ప్రజాధరణ కలిగిన ఎంపీ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో తమకు ఎంతో హుందాగా ఎంపీ కోటగిరి శ్రీధర్ సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అధికారులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రజా ప్రయోజన పనులను సమర్ధవంతంగా ముందుకు తీసుకువెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, దిశ కమిటీ సభ్యులు, ఉంగుటూరు ఎంపిపి ఘంటా శ్రీలక్ష్మీ, చింతలపూడి ఎంపిపి డాక్టర్ బి.రాంబాబు, కైకలూరు సర్పంచి వి.వసంతకుమారి పాల్గొన్నారు.

'తపాలా శాఖలో ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలి'

ఏలూరు టౌన్: తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకులను లక్ష్యాల పేరుతో పనిభారం మోపుతూ తపాలా శాఖ ఉన్నతాధికారులు చేస్తున్న వేధింపులు తక్షణమే ఆపాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో చాలీచాలని జీతాలతో పనిచేస్తూ తపాలా శాఖ అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామీణ డాక్ సేవకులపై పలు లక్ష్యాల పేరుతో ఒత్తిడి చేయడం సరైనది కాదని వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సందర్భంలో 2024 ఫిబ్రవరి 28 నాటికి తపాలా శాఖలో పనిచేస్తున్న ప్రతి ఎస్ఒ, బిఒలు రూ.10 వేల పాలసీ ప్రీమియం జమ అయ్యేలాగా కస్టమర్స్‌ను చేర్పించాలని గ్రామీణ డాక్ సేవకులపై తపాల శాఖ ఉన్నతాధికారులు పనిభారం పెంచడం వల్ల డాక్ సేవకులు మానసిక ఒత్తిడికి గుర్తై అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగి ఎవరైనా ఇబ్బందులకు గురైతే అటువంటి వాటికి తపాలా శాఖ ఉన్నతాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో బిజెపి, వైసిపిని సాగనంపాలి: సిపిఐ

బుట్టాయగూడెం: రానున్న ఎన్నికల్లో దేశంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి పంపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం సిపిఐ నియోజవర్గం కార్యదర్శి కారం ధారయ అధ్యక్షతన మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తూ మోడీ మరొకసారి ప్రజలను మోసం చేసేందుకు సంసిద్ధమవుతున్నాడని ఆయన వివరించారు. అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని చూపిస్తూ 142 కోట్ల మంది జనాభా ఉన్న భారతదేశంలో కొంతమంది హిందూ ఓట్లను సాధించడానికి మోడీ మరలా మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పేదరిక నిర్మలనే ధ్యేయమని చెబుతున్న మోడీ ప్రభుత్వం 81 కోట్ల మందిని పేదరికంలోకి నెట్టేశారని ఎద్దేవా చేశారు. తనను తాను కాపాడుకునేందుకు మోడీ ప్రభుత్వానికి మద్దతిస్తూ జగన్మోహన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్రాన్ని గాలికి వదిలేసారని విమర్శించారు.

ఇంటర్ ప్రశ్నాపత్రాలు భద్రం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

కళాశాలల వారీగా ఇనుప బాక్సుల్లో ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచి పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్లను నిర్వహిస్తున్నామని పట్టణ సిఐ బాల సురేష్ తెలిపారు. నూజివీడు పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాల మొదటి సెట్‌ను పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం భద్రపరిచారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ మాట్లాడుతూ మరో రెండు సెట్లు వస్తాయని, మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వం నిర్ణయించిన సెట్ ప్రశ్న పత్రాలు వినియోగిస్తారని సిఐ బాల సురేష్ తెలియజేశారు.

IN THE COURT OF HONOURABLE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT: RAJAMAHENDRAVARAM
O.S NO: 659 /2023
Between:
State Bank of India, Bazar Branch, Rajahmundry, Rep. by its Branch Manager. ...Plaintiff
VS
Byreddy Avinash ...Defendant
SUMMONS
To:
Byreddy Avinash, S/O Rama Rao, D.NO:1-168, Reddyvari Street, Near Galigopuram Temple, Sanivarapupeta, ELURU.
Please take notice that the above plaintiff filed the suit against you for recovery of an amount Rs 1,06,968/- together with subsequent interest and other reliefs. The above suit stand posted to 18-03-2024 for your appearance either in person or through a pleader on the above mentioned date in the said court at 10.30 A.M to answer the claim, failing which the matter will be disposed off as per law.
KANDUKURI SRINIVAS
SBI Panel Advocate
Rajamahendravaram
Cell: 9059549017

పాస్‌పోర్టు పోయినది
NALLIMILLI SHARADA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 24-12-2012న K9231958 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు కొండావారిపాలెం నుండి మొగల్తూరు ఎస్‌బిఐ బ్యాంకు వీధికి వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.
NALLIMILLI SHARADA
W/o. NALLIMILLI RATNARAJU
D.No. 7-46, Kondavaripalem
Mogaltur, Mogaltur Mandal
West Godavari District

పాస్‌పోర్టు పడిపోయినది
విప్పర్తి జోషిబాబు, తండ్రి: శేఖర్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. G7912077 గల పాస్‌పోర్టు ది. 26-02-2024వ తేదీన రెన్యూవల్ నిమిత్తం కంచుమర్రు గ్రామం నుండి అత్తిలి సెంటర్‌కు వెళ్ళి చూచుకొనగా నా పాస్‌పోర్టు కనబడలేదు. మార్గమధ్యలో ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు.
చిరునామా: విప్పర్తి జోషిబాబు
తండ్రి: శేఖర్, డోర్ నెం. 1-31
పెదపేట, కంచుమర్రు
అత్తిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 7032160876

In the Court of III Additional District Judge at Bhimavaram
I.A. 206/2023 in O.S. 27/2023
Between:
ABIS Exports (India) Pvt. Ltd., ...Plaintiff
AND
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs. ...Defendant
To:
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs, S/o. (late) Satyanarayana, 4-5-1/1, Kovvada Center, 39th Ward, Durgapuram, Bhimavaram-2, Bhimavaram Mandal, West Godavari District, Andhra Pradesh - 534202.
పై నెంబరు గల I.A. లో మీ హాజరు నిమిత్తం 13-03-2024 నాటికి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా 13-03-2024 మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు మిమ్ములను Exparte చేసి తదుపరి విచారణ కొనసాగించెదరు.
(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
U.V.SUBRAHMANYAM
విజయవాడ A.NATARAJ
26-02-24 Advocates for Plaintiff

In the Court of III Additional District Judge at Bhimavaram
O.S. 27/2023
Between:
ABIS Exports (India) Pvt. Ltd., ...Plaintiff
AND
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs. ...Defendant
To:
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs, S/o. (late) Satyanarayana, 4-5-1/1, Kovvada Center, 39th Ward, Durgapuram, Bhimavaram-2, Bhimavaram Mandal, West Godavari District, Andhra Pradesh - 534202.
పై నెంబరు గల కేసు మీ హాజరు నిమిత్తం 13-03-2024 నాటికి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా 13-03-2024 మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు మిమ్ములను Exparte చేసి తదుపరి విచారణ కొనసాగించెదరు.
(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
U.V.SUBRAHMANYAM
విజయవాడ A.NATARAJ
26-02-24 Advocates for Plaintiff